నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

శ్రీవారి కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులో గల అపురూప వేంకటేశ్వర ఆలయం 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీవారి కల్యాణోత్సవం ఆలయ కమిటీ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం హెూమం, శ్రీవారి కల్యాణోత్సవము, సాయంత్రం శ్రీవారికి గరుడసేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్పర్సన్ అమృత లత, కమిటీ సభ్యులు ప్రభ దేవి, రమాదేవి, శ్రీనివాస్ రెడ్డి, రమణ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ఆర్మూర్

జనవరి 11వ తేదీన కల్లెడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆల్ ఇండియా సబ్ జూనియర్ ఛాంపియన్షిప్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలలో జిల్లా జట్టు ఎంపికలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి బి.కార్తిక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పూర్ణచంద్ర ఆదివారం తెలిపారు. ఈనెల 17 నుంచి 20 వరకు జి.ఎం.సి. బాలయోగి గచ్చిబౌలి స్టేడియం హైదరాబాద్‌లో నిర్వహించే హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని వైస్ ప్రిన్సిపాల్ సాయన్న తెలిపారు. ఈ సందర్భంగా చక్రపాణి, గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు పి.డి. జ్ఞానేశ్వర్, పిఈటి, కె.రాజేందర్, పాఠశాల కళాశాల బృందం నాన్‌టీచింగ్ స్టాఫ్ సూపరింటెండెంట్ లక్ష్మి, లక్ష్మణ్, లక్ష్మణ్, వినిల్, బి.కార్తీక్‌ను అభినందించారు.

కుళ్లిన మాంసం విక్రయం

- అధికారుల పర్యవేక్షణ లోపం..
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు


కుళ్ళిన ఫ్రిజ్‌లో స్టోరేజ్ చేసిన మాంసం విక్రయిస్తూ..

నవతెలంగాణ-బిచ్కుంద

మాంసం విక్రయదారులు నిబంధనలకు విరుద్ధంగా చనిపోయిన మేకలు కోసి, కుళ్ళిన మాంసం రెండు, మూడు రోజులు ఫ్రిజ్‌లో స్టోరేజ్ చేసిన మాంసాన్ని యెథేచ్ఛగా విక్రయిస్తున్నారు. దీనికి తోడు అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ మాంసం కొనుగోలు చేసిన ప్రజలు తిన్న తర్వాత అనారోగ్యం పాలవుతున్నారు. పశు వైద్యులు, గ్రామపంచాయతీ అధికారుల పర్యవేక్షణలో కొనసాగాల్సిన విక్రయాలపై పట్టింపు కరువైంది. ఆదివారం వస్తే ప్రజలు మాంసం తినడానికి ఇష్టపడతారు. మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం పక్కనగల మాంసం విక్రయదారుల వద్ద మాంసం కొనుగోలు చేయడానికి వెళ్ళిన ప్రజలు అక్కడ విక్రయిస్తున్న మాంసం రెండు మూడు రోజులుగా ఫ్రిడ్జ్‌లో స్టోరేజ్ చేసిన కుళ్లిన మాంసంగా గుర్తించి ప్రజలు ఎలా విక్రయిస్తారని గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తామని ప్రశ్నించడంతో వెంటనే అప్రమత్తమైన మాంసం విక్రయదారులు కుళ్లిన స్టోరేజ్ చేసిన మాంసాన్ని వెంటనే అక్కడి నుంచి తరలించారు. మాంసం విక్రయదారులు కుళ్ళిన స్టోరేజ్ చేసిన మాంసం విక్రయిస్తున్నారని గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి ప్రజలు తీసుకెళ్ళి ఫిర్యాదు చేశారు. అధికారులు అరకొర తనిఖీలు చేపట్టడం తప్ప పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టడం లేదని దీంతో మాంసం విక్రయదారులు కొత్త కొత్త పద్ధతులు అవలంబిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారని, కలుషిత మాంసం తినడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక తరలింపు ఇష్టారాజ్యం

- అధిక లోడుతో ఇసుక రవాణా
- కన్నెత్తి చూడని అధికారులు

నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇసుకను ఇష్టానుసారంగా తరలిస్తున్నారు కొందరు అక్రమార్కులు. మండలంలో అధిక లోడుతో ఇసుకను తరలిస్తున్నా.. అధికారులు కన్నెత్తి చూడటం లేదు. తద్వారా గ్రామాల రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయి.


అధిక లోడుతో ఇసుకను తరలిస్తున్న టిప్పర్

నవతెలంగాణ-నిజాంసాగర్

వివరాల్లోకి వెళితే మండలంలోని నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణం కోసం ఇసుకను పుల్కల్ గ్రామం నుంచి మండలంలోని మల్లూరు గ్రామం లోకి నిబంధనలకు మించి ఇసుకను అధిక లోడుతో తరలించడంతో గ్రామాల్లోని రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. అధిక లోడుతో టిప్పర్లు వెళ్లడం ద్వారా రోడ్లన్నీ దుమ్ము మయం అవుతున్నాయి. దీంతో ఆ రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రజలు దుమ్ము ధూళితో శ్వాసకోస సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు.

మూడు సంవత్సరాల క్రితం నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ మండలంలోని మల్లూరు గ్రామంలో మంజూరైంది. ఆ ప్రాజెక్టును కాంట్రాక్టు తీసుకున్న మెగా కంపెనీ ప్రాజెక్ట్ పనుల నిమిత్తం గ్రామాలలోని రోడ్ల వెంబడి భారీగా ఇసుకను, కంకర, సిమెంటును టిప్పర్లు, లారీల్లో తరలిస్తోంది. దీంతో గ్రామాలలోని రోడ్లన్నీ మొత్తం మట్టిమయమయ్యాయి. ప్రాజెక్ట్ పనులు ప్రారంభం ముందు గ్రామాలలో ప్రజలకు ఇబ్బంది కాకుండా వాటర్ క్యూరింగ్ చేస్తామని చెప్పిన మెగా కంపెనీ.. ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదు. రోడ్ల వెంబడి ఏ చిన్న వెహికల్ వెళ్లినా.. భారీగా దుమ్ము ధూళి లేచి గ్రామాలలోని ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ విషయంపై మెగా కంపెనీ నిర్వహకులను అడిగితే వారు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికలోడుతో టిప్పర్లను రోడ్లపై వెళ్ళనివ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గొడవలో భయపడి ఒకరు మృతి


న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట మృతుడి బంధువుల ఆందోళన


లక్ష్మిపతి (ఫైల్)

నవతెలంగాణ-తాడ్వాయి

గొడవలో భయపడి ఒకరు మృతిచెందిన ఘటన ఆదివారం మండలంలోని దేమీకలాన్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పురం లక్ష్మీపతి (35) మంగలి రాజయ్య ఇంటి అరసంది విషయంలో గొడవ పడ్డారు. దీంతో భయాందోళనకు గురైన లక్ష్మీపతి ఒక్కసారిగా సోమ్మసిల్లి కుప్పకూలి పోయాడు. విషయాన్ని గమనించిన కొందరు కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. సంబంధీకులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ.. తాడ్వాయి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. కుటుంబానికి సహాయం అందేలా చూస్తామని చెప్పడంతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ-జుక్కల్

అప్పుల బాధ భరించలేక మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై భువనేశ్వర్, కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బిజావార్ చంద్రమోహన్ పద్మశాలి (36) అనే యువకుడికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు ఉన్నారు. చంద్రమోహన్ పని లేకుండా జులాయిగా తిరుగుతూ ఉండడం వలన అప్పులు ఎక్కువయ్యాయి. అప్పులు కట్టేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో అప్పులు ఎలా తీరుతాయోనని భయాందోళన చెంది మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 13న మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో అప్పులు తీరడం లేదని.. ఇలాగైతే కుటుంబం గడవడం కష్టమవుతుందని కన్నీరు పెట్టుకున్నాడు. గత రెండు రోజులుగా ఇంటి నుంచి బయటకు వెళ్లిన చంద్రమోహన్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులోని ఓ బావి వద్ద చెప్పులు కనబడడంతో ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించారు. చంద్రమోహన్ శవం బావిలో పైకి తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. తమకు ఎవరి మీద అనుమానం లేదని తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో ఆదివారం పేకాట స్థావరంపై బోధన్ రూరల్ పోలీసులు దాడిచేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే సాలూర, కల్దుర్కి నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న నాయకులు


నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామంలో కడం విక్రమ్ రెడ్డికి ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి నుంచి మంజూరైన రూ.50 వేల చెక్కును కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి, నిధులను మంజూరు చేయడంలో కృషి చేసిన ఆర్మూర్ నియోజకవర్గ ఇంఛార్జి వినయ్ కుమార్ రెడ్డికి, ముక్కెర విజయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విలెజ్ ప్రెసిడెంట్ నరేష్‌గౌడ్, ఎర్ర జితేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంజీవ్, యువజన నాయకులు షేక్ సమీర్, కడం మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని నిఘా నేత్రాలు

మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలంటున్న కాలనీవాసులు


37వ డివిజన్‌లోని అంబేద్కర్ చౌరస్తా..


(ఇన్‌సెట్లో) పనిచేయని సీసీ కెమెరాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రం లోని డివిజన్ నెంబర్ 37 అంబేద్కర్ కాలనీ చౌరస్తాలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ఈ చౌరస్తా ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డు గుండా ఉదయం, సాయంత్రం పూట విద్యార్థులు పాఠశాలకు, కాలేజీలకు వెళ్తుంటారు. ఇటీవలే ఒక స్కూల్ పిల్లలతో వెళ్తూ ఆటో పల్టీ కొట్టి విద్యార్థులకు గాయాలయ్యాయి. కాలనీ లోపలికి అర్ధరాత్రి వరకూ గుర్తు తెలియని వ్యక్తులు తిరుగుతుంటారు. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సీసీ కెమెరాలు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



దొంగలను పట్టించడంలో సీసీ కెమెరాలు బాగా పనిచేస్తాయి. ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానంగా పనిచేస్తుంది. కావున కాలనీవాసులందరూ తొందరగా సిసి కెమెరాలు మరమ్మతులు చేయించాలి.

- రాజేష్ టైలర్, కాలనీవాసుడు

సీసీ కెమెరాలు పునరుద్ధరించాలి



సీసీ కెమెరాలతో ఉండడంవల్ల చాలా సెక్యూరిటీగా ఉంటుంది కాబట్టి తొందరగా సీసీ కెమెరాలు పునరుద్ధరించాలని కోరుతున్నాను

- సిహెచ్.ప్రశాంత్, కిరాణ దుకాణ యజమాని

రైతులకు అండగా కాంగ్రెస్

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి


కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

రాష్ట్రంలో ఎర్రజొన్న, పసుపు సాగు చేసిన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర కిసాన్ ఖేత్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రాష్ట్ర రైతు కార్యాచరణ నాయకులు ప్రభాకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీనిచ్చారు. ధరల నియంత్రణ చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను పసుపు బోర్డుపై నిలదీశారు. పసుపు పంటపై రూ.15 వేలు, ఎర్రజొన్నకు రూ.5 వేలు అందించాలన్నారు. జిల్లా, ఆర్మూర్ డివిజన్ పరిధిలోని రైతులకు అండగా ఉంటామని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర రైతు కార్యాచరణ నాయకులు ప్రభాకర్ సైతం మాట్లాడుతూ.. నిజామాబాద్, సాంగ్లీ మార్కెట్‌కు వ్యత్యాసం రూ.5వేలు ఎందుకుందని ప్రశ్నించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. ఈ పంటలకు అదనంగా బోనస్ రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పసుపు, ఎర్రజొన్న పంటలను ఆహార పంటలుగా గుర్తించాలన్నారు. వ్యాపార సంఘాలు, హమాలీలు, కార్మికులు దొంగలు కాదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎర్రజొన్న, పసుపు రైతులను ఎంఎస్పీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు ముగ్గిడి ముత్యం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చందా రవి, కిసాన్ ఖేత్ అధ్యక్షులు బద్దం సాగర్, టౌన్ అధ్యక్షులు ముస్కు మోహన్, డీసీసీ ఉపాధ్యక్షులు సుంకరి రాజ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు ఏలేటి మల్లారెడ్డి, లోక సుభాష్, ప్రశాంత్ రెడ్డి, అబ్రార్, ముస్కు శ్రీను, పోల ప్రవీణ్, కిషోర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ పంపిణీతోనే పేదరిక నిర్మూలన

- భూమి కోసం పోరాడటానికి ప్రజలను సన్నద్ధం చేయాలని
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్



మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

భూ సంస్కరణలు అమలు జరిగి పేదల చేతికి భూమి వచ్చి నీటి సౌకర్యం లభించిన చోట పేదరిక నిర్మూలన జరుగుతుందని, ఆ విధంగా సమగ్ర భూపంపిణీ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం రెండవ రోజు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ హాజరై మాట్లాడారు. దున్నే వాడికి భూమి కావాలని, వెట్టి చాకిరీ.. కుల మతాలు లేని సమాజం కావాలని, ఎర్రజెండా నాయకత్వంలో వీర తెలంగాణ విప్లవ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా 4000 మంది ప్రాణాలర్పించి 3000 గ్రామాలలో 10 లక్షల ఎకరాలు పంచిన చరిత్ర కమ్యూనిస్టులదని కొనియాడారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల బంజారు, మిగులు భూములు పేదలకు పంచామని చెబుతున్న భూములలో తిరిగి భూస్వాములు, పలుకుబడి కలిగిన వారు అక్రమంగా, దౌర్జన్యంగా స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. పోరాడిన వారిపై అధికార పార్టీలు నిర్బంధం ప్రయోగించి కేసులు బనాయించారని, జైలుకు పంపించారని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కోనేరు రంగారావు కమిషన్ రాష్ట్రంలో భూమిలేని పేదలకు కనీసం ఎకరం చొప్పున పంచడానికి భూమి ఉందని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. 2007లో జరిగిన భూ పోరాటం సందర్భంగా ముదిగొండ పోలీస్ కాల్పులలో ప్రభుత్వం ఏడుగురిని పొట్టన పెట్టుకుందన్నారు. ఆ పోరాటం ఫలితంగా ప్రభుత్వం దిగి వచ్చి కొంతమందికైనా భూములు పంచిందని తెలిపారు. రాష్ట్రంలో కెసిఆర్, రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు పేదలకు భూ పంపిణీ చేయకపోగా.. భూచట్టాలన్నింటినీ నీరుగార్చి పేదల భూములను పెద్దలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. మరోవైపు కార్పొరేట్ కంపెనీలు పరిశ్రమలు పెట్టుకోకుండానే తీసుకున్న భూములను తాకట్టు పెట్టి రుణాలు తీసుకొని ఎగ్గొట్టి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. పోరాడితేనే భూమి దక్కుతుందని పేదలను చైతన్యపరిచి భూమి కోసం పోరాడటానికి ప్రజలను సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేసి భూమిలేని ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమి గ్రామాలలో ఐదు, పట్టణాలలో మూడు గజాల ఇంటి స్థలం పంపిణీ చేయాలన్నారు. బలవంతపు భూసేకరణ ఆపాలన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ తరగతుల్లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొర్ర సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, సీఐటీయూ నాగేశ్వర్‌రావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నాగుల గోవర్దన్, జిల్లా సహాయ కార్యదర్శులు నర్రా శంకర్, ఎస్.సాయిలు, నాయకులు చంద్రకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నూతన జాతీయ విద్యా విధానం

రద్దుకు రణం చేయాలి

- ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు శోభన్
- అట్టహాసంగా ఎస్ఎఫ్ఐ 16వ నగర మహాసభలు ప్రారంభం


మహాసభల ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు



నవతెలంగాణ-కంఠేశ్వర్

విద్యార్థులంతా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం రద్దు కోసం రణం చేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు శోభన్ పిలుపునిచ్చారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 16వ నగర మహాసభలను స్థానిక నాందేవ్‌వాడలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర ఉపాధ్యక్షురాలు వీణ జెండాను ఆవిష్కరించారు. నగర మహాసభల సందర్భంగా సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఈ మహాసభలను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు శోభన్ మాట్లాడుతూ.. 1970లో ఎస్ఎఫ్ఐ పురుడు పోసుకుని విద్యారంగ సమ స్యలపై అనేక పోరాటాలు నిర్వహించి ఛాంపియన్‌గా నిలిచిందని అన్నారు. దేశంలో శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాలను ప్రశ్నిస్తుందని అన్నారు. అదేవిధంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దీపిక, విగ్నేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి సంవత్సర కాలం గడిచినా.. విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటని వాపోయారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియింబర్స్మెంట్ విడుదలపై సీఎం రేవంత్‌రెడ్డి పల్లెత్తు మాట మాట్లాడకపోవడం బాధాకరమని అన్నారు. వెంటనే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎస్ఎం జిల్లా కార్యదర్శి సిర్ప లింగం, ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్, చక్రి, ఆజాద్, రాజు, వినీత్, నవదీప్, రాజి, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొలువు సాధించిన మామిడిపల్లి వాసి



నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లికి చెందిన కొనపత్రి గోవర్ధన్ ప్రభుత్వ కొలువు సాధించాడు. మున్సిపల్ పరిధిలోని విశ్వబ్రాహ్మణ వృత్తికి చెందిన ఈయన చిన్ననాటి నుండి చదువులో ముందుంటూ స్వర్ణకార వృత్తిలో సైతం తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. జిల్లా విద్యాశాఖ అధికారిద్వారా ఎస్జిటి టీచర్ గా నియామక పత్రం అందుకున్నారు. ధర్పల్లి మండలంలోని డిబి తండాలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్లు మేడిదాల సంగీత రవి గౌడ్, ఆకుల రాము, కోన పత్రి కవిత కాశీరాం, విశ్వబ్రాహ్మణ కుల సంఘ సభ్యులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేతగా బాబాపూర్ జట్టు



నవతెలంగాణ-భీంగల్ రూరల్

జక్రాన్ పల్లి మండలం కలిగోట్ గ్రామంలో వారం రోజుల నుండి నిర్వహిస్తున్న నలిమెల చిన్న రాజన్న స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్లో కలిగోట్, బాబాపూర్ జట్లు తలపడగా ఉత్కంఠగా సాగిన మ్యాచ్లో చివర్లో బాబాపూర్ జట్టు విజయం సాధించింది. చివరి బంతి వరకు ఎంతో ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్లో బాబాపూర్ జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు ట్రోఫీతో పాటు ప్రైజ్ మనీని టోర్నీ మేనేజ్మెంట్ గ్రామస్తులు కలిసి అందించారు. ఈ స్మారక టోర్నమెంట్లో పాల్గొన్న క్రీడాకారులందరికి మేనేజ్మెంట్ వారికి అందరూ అభినందనలు తెలియజేశారు.

పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది రాజేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో కాకతీయ, శ్రీ భాష్యం, ఎస్సార్ విద్యాసంస్థలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది రాజేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. విద్యా రంగ సమస్యల పట్లనే కాకుండా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే రకంగా ప్రతిభ పరీక్షలు నిర్వహిస్తున్న యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీకి అభినం దనలు తెలిపారు. రానున్న పదవ తరగతి బోర్డు పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా కృషి చేయాలన్నారు. కాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ రజనీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులు అందరూ ఈ ప్రతిభ పరీక్షను బోర్డు పరీక్షలకు ఒక సన్నాహక పరీక్షగా భావించి శ్రద్ధతో రాయాలని తెలిపారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పెద్ది సూరి మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికై పోరాటాలు నిర్వహిస్తూనే విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేలా ప్రతిభా పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధాల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు పోషమైన మహేష్, గణేష్, యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వేణు, మారుతి, వైష్ణవి, దుర్గ, బాబురావు సాయి, కాకతీయ విద్యాసంస్థ బోధన సిబ్బంది పాల్గొన్నారు.

నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో వ్యక్తి అదృశ్యం



షేక్ బాబా (ఫైల్)

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి అదృశ్యమైనట్టు రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నాందేడ్ పట్టణం శివాజీ నగర్‌కు చెందిన షేక్ బాబా(58) ఈనెల 14న కరీంనగర్‌లో తన చిన్న కూతురు ఇంటి నుంచి నాందేడ్‌కు వెళ్లేందుకు కరీంనగర్ రైల్వే స్టేషన్ నుంచి రైలులో బయలుదేరాడు. నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగి కనిపించలేదని తెలిపారు. దీనిపై ఆయన కూతరు దరఖాస్తు ఇవ్వగ వెంటనే మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు. ఎక్కడైనా ఈ వ్యక్తి కనిపిస్తే వెంటనే ఎస్ఐ నంబర్ 8712658591కు తెలియజేయాని పేర్కొన్నారు.

ఉదయం పోయింది.. సాయంత్రం దొరికింది..

నగరంలోని రైల్వే స్టేషన్‌లో ఉదయం పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సాయంత్రం దొరికిందని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయిరెడ్డి తెలిపారు. రైల్వే ఎస్సై వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహేష్ పని నిమిత్తం నిజామాబాద్‌కు వచ్చాడు. తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు ఉదయం 8 గంటలకు నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చి ప్లాట్ ఫామ్-2పైన కూర్చొని నిద్ర పోయాడు. గుర్తు తెలియని దొంగ మహేష్ జేబుల్లోంచి రూ.45వేల ఫోన్ ఎత్తుకెళ్లాడు. అనంతరం మహేష్ జేబులో చూసుకునేసరికి ఫోన్ లేకపోవడంతో రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైల్వే స్టేషన్ ఆవరణంలో చెకింగ్ చేస్తుండగా సాయంత్రం 7గంటల సమయంలో ఒక వ్యక్తి రైల్వేస్టేషన్‌లో అనుమానంగా తిరుగుతుండగా డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు రాములు, శ్రీకాంత్ ఆయన్ను పట్టుకొని విచారించారు. ఆయన పేరు వినయ్‌కుమార్ (31) నవీపేట్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. తన వద్ద ఉన్న ఫోన్ దొంగిలించినదేనని చూయించగా వెంటనే ఆయన్ను పోలీస్ అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి ఫోన్ రికవరీ చేసినట్టు పోలీసులు తెలిపారు.

యాదగిరన్న సంతాప సభ వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌లను ఆవిష్కరించిన పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయుసీఐ) ఆధ్వర్యంలో ఆదివారం కిసాన్ నగర్ గ్రామంలోని సీజే బీడీ కార్యాలయం వద్ద కామ్రేడ్ కర్నాటి యాదగిరన్న సంతాప సభ వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఏం.ముత్తన్న మాట్లాడుతూ 50 సంవత్సరాల నుండి ఉమ్మడి రాష్ట్రంలో సిపిఐ (ఎం.ఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులుగా, నిజామాబాద్ జిల్లా కార్యదర్శిగా కొనసాగారన్నారు. యాదగిరన్న జిల్లాలో రైతు కూలీ సంఘాలను జీతగాళ్ల సంఘాలను బీడీ కార్మిక సంఘం ను, విద్యార్థి యువజన సంఘాలను అనేక ప్రజా సంఘాలను ఏర్పాటు చేసి వాళ్ల హక్కుల సాధన కొరకు నిరంతరం పోరాటాలు నడిపి వారి హక్కులను సాధించి పెట్టడంలో ముందుండేవారని అన్నారు. నిజామాబాద్ లోనీ రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో సోమవారం జరిగే సంతాప సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు తూర్పాటి శ్రీనివాస్, ఎన్.నిఖిల్, ఉమేష్, వినోద్, చిన్న దాసు, సునీల్, దినేష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు వాసికి ఐదు లక్షల ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గంలోని ఆలూర్ మండలం వాసి నిమల వీరేంద్ర కి అనారోగ్యం కారణంగా నిమ్స్ ఆసుపత్రి లో చికిత్స నిమిత్తం ఎల్ ఓ సి అవసరం ఉందని స్థానిక నాయకులు విన్నపం మేరకు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రూ.5లక్షల రూపాయల ఎల్‌వోసిని మంజూరు చేయించి ఆదివారం హైదరాబాదులోని ఆసుపత్రిలో వారి కుటుంబ సభ్యులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఎల్ ఓ సి ల ద్వారా పేదవారి ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ చూపించిన ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు నిమ్మల ముఖేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు గిరీష్, డాక్టర్ అరుణ్, హరీష్ మాట్లాడుతూ మండల ప్రజలు ఎవరైనా అనారోగ్య రిత్యా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ఖర్చులను సీఎంఆర్‌ఫండ్ ద్వారా ఇప్పిస్తానని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్యం చేయించుకోలేని స్థితిలో అనారోగ్యంతో ఉంటే ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లే ఎల్ఓసి ఇప్పించి వైద్య సేవలు అందేలా చూస్తాను అన్నారు.

ధాన్యం ఆరబోసేందుకు రోడ్డే దిక్కు

- వాహనదారులకు ఇబ్బందులు
- తరచూ ప్రమాదాలు

నవతెలంగాణ-ఆర్మూర్

ధాన్యం ఆరబోసేందుకు రైతులకు రోడ్లే దిక్కయ్యాయి. రైతు ప్రభుత్వాలంలూ చెప్పుకోవడమే తప్ప రైతులకు అత్యవసరమైనవి ధాన్యం ఆరబోసేందుకు ఫ్లాట్‌ఫాంలను మాత్రం నిర్మించడంలేదు. దీంతో రైతులు గత్యంతరం లేక రోడ్లపై ధాన్యం ఎండబెడుతున్నాడు. ఈక్రమంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళలో వడ్లకుప్పలు కనిపించడం ప్రమాదాలకు గురవుతున్నారు.

ఏ పంట దిగుబడి వచ్చిన ఆరబెట్టాలంటే తారు రోడ్డు ఎక్కాల్సిందే. లేదంటే పంటలు ఎం డడం గగనం అవుతుంది. కొన్ని గ్రామాల్లో రైతులు ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రోడ్లపై ఆరబెట్టుకోవాలని నిబంధనలు సైతం చేసుకున్నారు. మరికొన్ని గ్రామాల్లో రోడ్లపైనే ఆరబెడుతున్నారు. ప్రస్తుతం జొన్న పంట కోతకు వచ్చి కొన్ని గ్రామాల్లోని జాతీయ రహదారులపైనే ఆరబెడుతున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగలు ప్రయాణం చేయడం ఇబ్బందిగా మారుతుండగా రాత్రుల్లో ధాన్యం కుప్పలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనాల రాకపోకలకు కష్టంగా మారుతుంది. ఖరీఫ్, యాసంగి సీజన్లలో వడ్లు, మక్కలను రోడ్లపైనే ఎండబోస్తున్నారు. ఎర్రజొన్నలు ప్రస్తుతం రోడ్లపైనే ఆంబెడుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలై కొన్నిచోట్ల మృతి చెందిన సంఘటనలు సైతం ఉన్నాయి. రోడ్లపైనే ధాన్యాన్ని పోయడంతో పెద్దపెద్ద వాహనాలు అతివేగంగా ఎదురెదురుగా రావడం రోడ్డుపై మరో వాహనం వెళ్లకుండా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు భయంతో ప్రయాణం చేస్తున్నారు.



జిల్లాలో...

జిల్లాలో ప్రతి వానకాలం యాసంగిలో వరి, మక్క, సోయా పంటలు కోయగానే రోడ్లపై ఆరబెడుతున్నారు. రా త్రులు అక్కడే కుప్పగా పోయడంతో వాహనదారులు చీకట్ల లో గుర్తించలేక పోతున్నారు. ప్రతి సీజన్లోనూ పదుల సంఖ్యలో గాయపడడం, మరికొన్ని చోట్ల ప్రాణాలు కోల్పోతున్నారు.

ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి..

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీస్, రవాణా అధికారుల సమన్వయంతో నియంత్రణకు చర్యలు చేపట్టాలని రైతన్నలు, వాహనదారులు కోరుతున్నారు.

పత్తాలేని ప్లాట్ ఫామ్‌లు..

నూరు శాతం సబ్సిడీపై సిమెంటు ఫ్లాటు ఫాంలను అందించాలని రైతులు నెలల తరబడి ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్న వాటికి పూర్తిస్థాయిలో మోక్షం లభించ టం లేదు. గతంలో ఈజీఎస్ పథకం ద్వారా ఫ్లాట్‌ఫామ్ లను నిర్మించి ఇస్తామని ప్రభుత్వాలు ప్రకటించాయి. కానీ ఇప్పటివరకు ముందడుగు పడలేదు. పాలకులు స్పందించి సమస్యలు తీర్చాలని రైతన్నలు కోరుతున్నారు.

ప్రజాపాలన కేంద్రం ప్రారంభం

- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రజా పాలన కేంద్రం ప్రారంభించినట్లు ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ తెలిపారు. సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే ఈ నెల 16 నుంచి మరోసారి ప్రారంభమైనట్లు ఎంపీడీవో తెలిపారు. గతంలో నిర్వహించిన సర్వే సందర్భంగా వివరాలు ఇవ్వనివారు, ఇళ్లకు తాళాలు వేసి వెళ్లినవారి కోసం ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు.ఈ నెల 28 వరకు వివరాలు ఇవ్వొచ్చని, ఫోన్ చేస్తే ఇంటికొచ్చి సర్వే సిబ్బంది వివరాలు సేకరిస్తారని తెలిపారు.

ప్రజాపాలన కేంద్రాలకు వచ్చి ఫారం నింపొచ్చని,

ఇంటిదగ్గరే నింపి ప్రజాపాలన కేంద్రాల్లో అందజేయవచ్చని, వెబ్‌సైట్లో సర్వే ఫాం డౌన్ లోడ్ డౌన్లోడ్ కూడా చేసుకోవచ్చు అన్నారు.వంద శాతం కులగణన లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇలా రెండోసారి అవకాశం ఇవ్వడం ద్వారా రాష్ట్రంలోని 100 శాతం జనాభాను కవర్ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మండలంలో మిగిలిపోయిన కుటుంబాల వివరాలను రెండోసారి సర్వేలో సేకరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఏ కులంవారు ఎంత మంది ఉన్నారు? వారి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయన్నది తెలుసుకోవడానికి ప్రభుత్వం ఈ కుల గణనను చేపట్టిందన్నారు. సర్వేను ప్రభుత్వం మూడు పద్ధతుల్లో చెపడుతుందని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్: ప్రభుత్వం ప్రకటించిన టోల్ ఫ్రీ నెంబర్ 040-21111111కు ప్రజలు ముందుగా ఏ ప్రాంతం నుంచైనా కాల్ చేసి, కులగణనలో తమ వివరాలను పొందుపర్చాలని కోరారు. ఈ నెల 16 నుంచి 28 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో ఫోన్ కాల్ చేయాల్సి ఉంటుందని, సంబంధిత అధికారి కాల్ చేసిన ఇంటికి వెళ్లి కుల గణన వివరాలు సేకరిస్తారన్నారు.

ప్రజా పాలనా సేవా కేంద్రాలు: గ్రామీణ ప్రాంతాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలనా సేవా కేంద్రాలకు ప్రజలు వెళ్లి తమ వివరాలను అందించాలన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంటారని, సర్వే ఫారాలను నింపడంలో ప్రజలకు వీరు సహకరిస్తారని తెలిపారు.

ఆన్‌లైన్‌లో..http//seeepcsurvey.cgg.gov.in అనే వెబ్‌సైట్ నుంచి సర్వే ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని, అందులో తమ కుటుంబ వివరాలను భర్తీ చేసిన తర్వాత ఆ ఫారాన్ని దగ్గరలోని ప్రజా పాలనా సేవా కేంద్రంలో సమర్పించాల్సి ఉంటుందని ఎంపీడీవో తెలిపారు. ప్రభుత్వం రెండోసారి కల్పించిన ఈ అవకాశాన్ని గతంలో సర్వేలను పాల్గొనని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అలరించిన విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు



నృత్యాలు చేస్తున్న చిన్నారులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీమ్‌గల్ పట్టణంలోని ముచ్కూర్ రోడ్డులో ఉన్న గంగా విద్యానికేతన్ పాఠశాలలో శనివారం రాత్రి 10వ తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ డే (వీడ్కోలు) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా సరస్వతి ఛాయా చిత్రానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. అనంతరం ముఖ్య అతిథి, వక్తలు ప్రసంగించారు. పాఠశాల వ్యవస్థాపకులు రాజ్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా ప్రణాళిక బద్ధంగా ఇష్టపడి చదవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఇది తొలిమెట్టు అని, ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛాయుతంగా ముందుకు సాగాలని అన్నారు.. సంబంధిత పాఠ్య విషయాల సందేహాల నివృత్తికి అర్ధరాత్రి విద్యార్థి ఫోన్ చేసిన మా ఉపాధ్యాయ సిబ్బంది ముందుంటారని అన్నారు. ఎవరు కూడా ఎట్టి పరిస్థితుల్లో నిరుత్సాహ పడకూడదన్నారు పట్టుదల, కృషి మీ వంతు అయితే విజయం తదనంతట అదే వరిస్తుందని అన్నారు. సబ్జెక్టులు అన్నీ సమానమే, దేనిని చులకనగా చూడరాదని, ఆయా విషయాల్లో లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమించాలన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యార్థులు అనవసరంగా వాహనాలను నడుపుతూ తల్లిదండ్రులకు ఇబ్బంది లకు గురి చేయవద్దని తెలిపారు. అలాగే సెల్ ఫోన్లకు దూరంలో ఉండాలని అన్నారు. తదనంతరం విద్యార్థులు చక్కటి నృత్యాలతో ఆహూతులను అలరించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు అన్నివేళల్లో సహాయ సహకారాలు అందించడానికి కంకణ బద్ధులై నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీ రాజ్ కుమార్, వార్డ్ కౌన్సిలర్ మూత లింబాద్రి, టీచర్స్ స్వప్న, రాధా, పూర్ణ, సునీత, సుమలత, ధరణి, సరూప, స్రవంతి, సంధ్య, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించాలి



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

చారిత్రక వారసత్వ సంపదను పరిరక్షించాలని "బాల్కొండ ఖిల్లా పరిరక్షణ సమితి" కార్యనిర్వాహక అధ్యక్షుడు, బాల్కొండ చరిత్ర గ్రంథ రచయిత బి.ఆర్ నర్సింగ్ రావు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం బాల్కొండ ఖిల్లా గుట్టపై పాఠశాల విద్యార్థులకు "బాల్కొండ ప్రాచీన చరిత్ర" అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేశారు. భీంగల్‌కు చెందిన ప్రముఖ కవి, రచయిత, అస్మక చరిత్ర పరిశోధక మండలి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, అల్లకొండ సాహిత్య కళా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు కొరవి గోపరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కంకణాల రాజేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దక్షిణ భారత్ లోనే అత్యంత ప్రాచీనమైన ప్రాంతం బాల్కొండ స్వతంత్ర రాజ్యాంగ ఉండేదన్నారు. మల్లయోధులైన అల్లయ్య, కొండయ్య అనే ఇద్దరు అన్నదమ్ములు అల్లకొండను పరిపాలించారని, క్రీ.శ 1059 నుండి అల్లకొండకు ఘనమైన చరిత్ర ఉందని తెలిపారు. అల్లకొండ (బాల్కొండ) దాదాపు ఆ కాలంలోనే 39 ఎకరాలకు పైగా విస్తీర్ణంతోనూ, చుట్టూ 9 కొండలతో, కోటకు ప్రధానంగా 6 ప్రవేశ ద్వారాలు, కోట చుట్టూ కందకం, కందకంలో

మొసళ్లను పెంచేవారని అన్నారు. అల్లకొండను రాష్ట్ర కూటులు, కళ్యాణి చాళుక్యులు, కాకతీయులు, బహమనీలు, కుతుబ్ షాహీలు, అసఫ్ జాహీలు పాలించారని తెలిపారు. మద్రాసు అత్యున్నత న్యాయస్థానంలో ఉన్నత హెూదాలో (1780-1836)లో పనిచేసిన ఏనుగుల వీరస్వామి 1830 లో కాశీ యాత్రలో భాగంగా హైదరాబాద్ పట్టణం నుండి బయలుదేరి ఆర్మూర్ మీదుగా పాదయాత్రగా జూన్ 26 నుండి 29 వరకు యాత్ర చేస్తూ 3 రోజులు బాల్కొండ లోనే గడిపానని ఏనుగుల వీరాస్వామయ్య రాసిన "యాత్ర చరిత్ర" గ్రంథంలో బాల్కొండ ప్రస్తావన ఉందని తెలిపారు. బాల్కొండ ఖిల్లా గుట్టపై12వ శతాబ్దానికి చెందిన కాకతీయుల కాలం నాటి శివాలయం ముందు గల శిలాశాసనం, పెద్ద పెద్ద బురుజులు, కోటలు, భారీ ఫిరంగి, అశ్వశాల, గజశాల, సైనిక స్థావరాలు, ప్రాచీన కోనేరు, అత్తా కోడళ్ళ బావి, అల్లయ్య కొండయ్యల శిలా విగ్రహాలు, పరమ శివ భక్తురాలైన సైదానబి సమాధి చూడవచ్చని వివరించారు. శిథిలమై కనుమరుగవుతున్న బాల్కొండ చారిత్రక ఖిల్లా వారసత్వ సంపదను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిరక్షించి సంరక్షించాలని ప్రభుత్వాలకు హితవు పలికారు. కార్యక్రమంలో బాల్కొండ ఖిల్లా పరిరక్షణ సమితి అధ్యక్షుడు భూసం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బొట్ల మధుసూదన్, సంయుక్త కార్యదర్శులు సంతోష్, డి.పవన్ కుమార్, కార్యవర్గ సభ్యులు వెంకటేష్, అశోక్ ట్రావెల్ బ్లాగ్స్ యూట్యూబ్ సృష్టికర్త బొజ్జ అశోక్ కుమార్ (నిర్మల్ జిల్లా, లక్ష్మణ చాంద మండలంలోని పీచర గ్రామ వాస్తవ్యులు) బొమ్మడి శ్రీనివాసరెడ్డి, కోమన్ పల్లి నర్సయ్య, దేవి రమేష్, పిట్టల సందీప్, కేశపురం సుమన్, శాంభవి హై స్కూల్, నవీన్ హై స్కూల్, కృష్ణవేణి హై స్కూల్, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయుడు శ్రీకాంత్, ఉపాధ్యాయ బృందం, అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితి క్రియాశీల కార్యవర్గ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పసుపు రైతుల రిలే నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న రైతులు

నవతెలంగాణ-ఆర్మూర్

పసుపు పంటకు గిట్టుబాటు ధర రావడం లేదని పసుపు రైతుల రిలే నిరాహార దీక్షలు చేస్తామని పసుపు రైతులు వినోద్ రెడ్డి, వెల్మ ముత్యంరెడ్డి, నక్కల రాములు, వన్నెల గంగారెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఆదివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు పసుపు మద్దతు ధర 17వేలకు పెంచాలని, ప్రస్తుతం ఉన్న ధర పదివేలు రైతులకు గిట్టుబాటు కావడం లేదని, పసుపు ధర పెంచి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేటి నుండి 21 వరకు రిలే నిరాహార దీక్షలు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శాంతియుతంగా నిర్వహిస్తామని తెలిపారు. దీక్షలకు పసుపు రైతులు పెద్ద ఎత్తున మద్దతు పలుకుతూ హాజరుకావాలని కోరారు. సమావేశంలో రైతులు పాల్గొన్నారు.

మంత్రిగా ప్రాణహిత- చేవెళ్ల పనులు చేపట్టారు

- మళ్లీ ఆయనకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి
- గిరిజన, ఆదివాసి చైర్మన్ యాదగిరి

నవతెలంగాణ-మోపాల్

జిల్లా నుంచి బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 21- 22 ప్యాకేజీ పనులు వేగవంతంగా జరిగాయని మాజీ ఎంపీపీ, ఆదివాసి గిరిజన చైర్మన్ కేతావత్ యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పెద్దలు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గిరిజన ఆదివాసిల తరపున ప్రత్యేక విన్నపాన్ని తెలియజేస్తున్నానని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు మంత్రివర్గంలో చోటు లేకపోవడం వల్ల జిల్లా అభివృద్ధి కూడా కొంతవరకు కుంటు పడుతుందన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లాకు రెండు మంత్రి పదవులు, ఒక స్పీకర్ పదవి ఇచ్చి రాష్ట్రంలోని జిల్లాకు ప్రముఖ స్థానంలో ఉంచారన్నారు. ఆ సమయంలో జిల్లా అభివృద్ధిలో సంక్షేమంలో పురోగతి సాధించిందన్నారు. అలీ సాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా నిజామాబాద్ జిల్లా ప్రజలకు తాగునీరు అందించారని తెలిపారు. ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న నిజామాబాద్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుచేసి, జనరల్ హాస్పిటల్‌ను అభివృద్ధి చేశారన్నారు. ఇంత అనుభవం ఉన్న సీనియర్ నాయకుడు క్యాడర్‌ను కాపాడుతూ జిల్లాకు పెద్దదిక్కుగా ఉన్నారన్నారు. తప్పు చేయడు, తప్పు చేస్తే క్షమించడు ముక్కుసూటి మనిషి అని అన్నారు. అనుభవం ఉన్న నాయకుడికి మంత్రి వర్గంలో స్థానం కల్పించి నిజామాబాద్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి మరియు సంక్షేమంలో ముందుకు తీసుకొని పోయే విధంగా చూడాలని కోరారు. సమావేశంలో జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ తారాచన్ నాయక్ ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు చంద్రనాయక్ మోపాల్ మండల్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి, మాజీ ఎంపీటీసీ వెంకట్రామ్, మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బున్నే రవీందర్, ధర్మారం మాజీ సర్పంచ్ గంగారం మరియు బంజారా సోదరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరిజన, ఆదివాసి చైర్మన్ యాదగిరి

గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను విజయవంతం చేద్దాం

- మండల ఇన్చార్జ్ పాల మల్లేష్



మాట్లాడుతున్న మండల ఇన్చార్జ్

నవతెలంగాణ-రామారెడ్డి

మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటి సంరక్షించాలని మండల ఇన్చార్జ్ పాల మల్లేష్ సూచించారు. ఎల్లారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకులు జీర్ల సత్యనారాయణ, జీర్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కొండెంగల బెడద



నవతెలంగాణ-బోధన్

అడవుల్లో తిరగవలసిన కొండెంగలు నేడు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా సాలూర గ్రామంలో కొండెంగలు అధికంగా సంచరిస్తుండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం పాఠశాల విద్యార్థికి కొండెంగ దాడిచేసి గాయపరిచినట్లు సమాచారం. పాఠశాల ఆవరణలో పెరిగిన చెట్లను విరిచివేస్తు, ఇండ్లపై గెంతుతూ ఆస్థులను ధ్వంసం చేస్తున్నాయి. కావున అధికారులు తక్షణమే స్పందించి కొండెంగలను పట్టుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌పై చర్చా గోష్టి

- శ్రామిక వర్గానికి నిధులు పెంచాలి
- తెలంగాణకు ద్రోహం చేసినందుకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి
- ప్రజా సంఘాల డిమాండ్



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-వర్ని

పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను సవరించి.. మార్పులు, చేర్పులు చేసి, శ్రామిక వర్గానికి నిధులు పెంచాలని ప్రజా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వర్ని మండల కేంద్రంలో తెలంగాణకు ద్రోహం - బడా బాబులకు భోజ్యం అనే అంశంపై కేంద్ర బడ్జెట్ మీద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చర్చ-గోష్టి నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందన్నారు. నిజామాబాదులో జాతీయ పసుపు బోర్డుకు నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. బోధన్ నుంచి బీదర్ వరకు రైల్వే లైన్ చర్చ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జక్రాన్‌పల్లిలో విమానాశ్రయానికి నిధులు ఇవ్వలేదని అన్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీ ఊసే ఎత్తలేదని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ద్రోహం చేసినందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చర్చ గోష్టిలో సీఐటీయూ, గ్రామపంచాయతీ యూనియన్, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, కేవీపీఎస్, అంగన్‌వాడీ యూనియన్, పలు యూనియన్‌ల నాయకులు నన్నేసాబ్, సాయిలు, లింగం, మల్లేష్, జీశాన్, అలీపాషా, సురేష్, సాయిలు, మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీలకు రూ.13,650 వేతనం ఇవ్వాలి..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల పనుల్లో భాగంగా పని చేస్తూ ప్రభుత్వాలకు ఆసరాగా అంగన్వాడీ టీచర్లు ఉంటున్నారని అంగన్వాడీ టీచర్ డివిజన్ యూనియన్ అధ్యక్షురాలు మంగ దేవి అన్నారు. బడ్జెట్‌పై చర్చాగోష్టిలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ టీచర్లకు పలు ప్రభుత్వ పనులను చేయిస్తూ పనిభారం పెంచుతుందని అన్నారు. చాలీచాలని వేతనాలకు పనిచేస్తూ అంగన్వాడీ టీచర్లు బాధలు దిగమింగుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం గతంలో మూడు నెలలు మాత్రమే రూ.13,650 వేతనాలు ఇచ్చిందని, ఇప్పటికీ మళ్ళీ పాత వేతనాలు రూ.7,800 చెల్లిస్తూ కాలం వెల్లదీస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మళ్ళీ పార్లమెంట్ సమావేశాలలో మినీ అంగన్వాడీ టీచర్లకు రూ.13,650 వేతనాలు ఇచ్చేలా బడ్జెట్ పెంచాలని జిల్లా నాయకుల దృష్టికి తెచ్చారు. లేని పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు పోరాటం చేస్తారని హెచ్చరించారు. దీనికి జిల్లా నాయకులు రమేష్ బాబు స్పందిస్తూ తప్పకుండా అంగన్వాడీ టీచర్ల వేతనాలపై ప్రభుత్వాల మెడలు వంచి పెంచిన వేతనాలు ఇచ్చేలా టీచర్లతో కలసి ప్రభుత్వాలకు తెలుపుతామని ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ప్రమోద్ మరణించిన విషయాన్ని తెలుసుకుని గ్రామ యువకులు ముందుకు వచ్చి రూ.3వేలు ఆర్థిక సహాయాన్ని, 25 కిలోల బియ్యాన్ని కుటుంబీకులకు అందజేశారు. భవిష్యత్తులో ప్రమోద్ పిల్లల చదువులకు సహాయం చేస్తామని గ్రామ యువకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు వంశీరెడ్డి, పవన్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, సంకీర్తన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, గ్రామస్తులు, తదితరులున్నారు.

రోగులకు ఉచితంగా మినరల్ వాటర్

- ఉత్తమ సేవలకు చిరునామా లయన్స్ కంటి ఆసుపత్రి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రి అంటే తెలియని వారు ఉండరు. లయన్స్ కంటి ఆసుపత్రి ఇప్పటికే ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందింది. అలాగే కంటి ఆసుపత్రికి కంటి రుగ్మతలతో చేరుతున్న రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందుతోంది. అంతేకాకుండా రోగుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే ధ్యేయంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను నెలకొల్పి వారికి ఉచితంగా మినరల్ వాటర్‌ను అందిస్తున్నారు. ఆస్పత్రిలో చేరిన రోగులకు ప్రతి ఒక్కరికీ ఒక లీటర్ మినరల్ వాటర్, బ్రేక్ ఫాస్ట్ సమయంలో అరలీటరు మినరల్ వాటర్ అందించే సౌకర్యం కల్పించారు లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు బసవేశ్వరరావు. అలాగే రోగులకు ఉత్తమ వైద్య సేవలందించేందుకు త్వరలో ఆరోగ్యశ్రీని అమలు చేయనున్నట్లు బసవేశ్వరరావు తెలిపారు.

ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి



ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-తాడ్వాయి

పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జూకంటి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్స్ ఓటర్లను అభ్యర్థించారు. నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, మెదక్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆదివారం మండలంలోని ఎర్రపాడు గ్రామంలోని గ్రాడ్యుయేట్ ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి ఓటర్లను అభ్యర్థించామన్నారు. ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ఆదేశాల మేరకు ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మల్లేష్ రెడ్డి, గైని రాజలింగం, సమన్వయ కమిటీ సభ్యులు మద్ది మహేందర్‌రెడ్డి, గాదెల రమేష్, మేకల రాజు, షౌకత్, అంబీర్ శ్యాంరావు, లక్ష్మణచారి, సుధాకర్ రావు, మమత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ గోదాముల్లో సెన్సార్‌లతో నిఘా

- బోధన్ సీడబ్ల్యూసీ గోదాంలో సెన్సార్ పరికరాల బిగింపు



నవతెలంగాణ-బోధన్

చౌక ధరల దుకాణాలకు ప్రభుత్వం సరఫరా చేసే బియ్యం పక్కదారి పట్టకుండా ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సిడబ్ల్యుసి గోదాములలో సెన్సార్ పరికరాల బిగింపుకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా బోధన్ పట్టణంలోని సిడబ్ల్యుసి గోదాంలో గత రెండు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వచ్చిన సాంకేతిక నిపుణుల బృందం మూడు గోదాములలో సెన్సార్లను ఏర్పాటు చేశారు. దీనివలన గోదాంలోని బియ్యం బయటకు పోయినప్పుడు కానీ, గోదాంలో ప్రవేశించిన వారిని సెన్సార్‌లు రికార్డు చేస్తాయి. ప్రతి గోదాంలో మాస్టర్ కీగా పిలవబడే మోడేంలు బిగించారు. ఇవి వీటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన సెన్సార్‌లను ఎప్పటికప్పుడు పనిచేసేలా చూస్తాయని టెక్నీషియన్‌లు తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన టెక్నీషియన్‌లు వీటి నిర్వహణపై సీడబ్ల్యూసీ అధికారులకు వివరించి అవగాహన కల్పించారు.

బెంగుళూరు ఏసీ బస్సులలో 10శాతం ఫ్లాట్ తగ్గింపు

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బెంగుళూరు ఏసీ బస్సుల బేసిక్ టికెట్ చార్జీపై 10 శాతం రాయితీ ప్రకటించింది. ఈ రాయితీ ఏసీ స్లీపర్, ఏసీ సీటర్, రాజధాని బస్సులకు వర్తిస్తుందని నిజామాబాదు రీజినల్ మేనేజర్ టి. జోస్నా ఆదివారం తెలిపారు. ప్రయాణీకులకు ఉన్నత స్థాయి ప్రయాణాన్ని మరింత అందుబాటులో ఉంచడం, సౌకర్యవంతంగా చేయడం లక్ష్యంగా ఈ అవకాశం ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని 10 శాతం తగ్గింపు టికెట్ చార్జీతో చౌకైన, సురక్షిత సౌకర్యవంతమైన ప్రయాణం చేయాలని కోరారు. ఈ తగ్గింపు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అన్ని ఏసీ బస్సుల ద్వారా అందుబాటులో ఉన్న హైదరాబాద్ నుంచి బెంగుళూరు రూట్లలో వర్తిస్తుందని, మరిన్ని వివరాలకు ముందస్తు రిజర్వేషన్ కోసం సంస్థ వెబ్‌సైట్ ఋఋఋ.ౌరంఱఎఱశీఎఎ.ఱఅ ద్వారా లేదా సమీప బస్సు రిజర్వేషన్ కౌంటర్ నందు కూడా టిక్కెట్ బుక్ చేసుకునే సౌకర్యం కలదని తెలిపారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలోని గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ సిడిసి చైర్మన్ మహమ్మద్ ఇర్షాదుద్దీన్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌కు ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణంలో సిడిసి కార్యాలయానికి 1000 గజాల ప్రభుత్వ స్థలం ఇప్పించాలని ఎమ్మెల్యే మదన్మోహన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. స్థలంతో పాటు రూ.20లక్షల వ్యయంతో భవనం నిర్మించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి

భారీ మెజారిటీ తీసుకురావాలి

- మండలాధ్యక్షుడు బుర్ర నారాగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి భారీ మెజార్టీ తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ కార్యకర్తలకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు మండల స్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ప్రచారం నిర్వహించి.. ప్రతి ఓటర్ దగ్గరకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నుంచి 55 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ దగ్గరికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త గ్రామ కమిటీ అధ్యక్షులు కష్టపడి పనిచేసి భారీ మెజార్టీని తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జొన్నల రాజు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, మండల యూత్ అధ్యక్షులు రాజు, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఎల్లమయ్య, భాస్కర్ గౌడ్, అశోక్, బైరయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్, నాయకులు కౌడ రవి, కాసిం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్ట్‌లు పంపిణీ



నవతెలంగాణ-నిజామాబాద్

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని కుర్నపల్లి గ్రామానికి చెందిన గాంధారి హనుమంతరెడ్డి అని యువ నాయకులు స్థానిక ఉన్నత పాఠశాలలోని సుమారు 120 మంది విద్యార్థులకు క్రీడా టీ షర్ట్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ సంజయ్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సిడిసి చైర్మన్‌కు క్లాస్‌మెట్స్ సన్మానం



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని ఆదివారం పదవ తరగతి 1995-1996 బ్యాచ్ క్లాస్‌మెట్స్ సిడిసి చైర్మన్ మహమ్మద్ ఇర్షాదుద్దీన్‌ను సన్మానించినట్టు తెలిపారు. స్నేహితులు పూలమాలతో సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా క్లాస్‌మెట్స్ మాట్లాడుతూ.. తమ మిత్రునికి సిడిసి చైర్మన్ పదవీ రావడం వలన అందరూ సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆయన మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆశీర్వదించారు.

ప్రాక్టికల్ పరీక్ష కేంద్రం తనిఖీ



ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి

నవతెలంగాణ-నిజాంసాగర్

ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల సైన్స్ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాన్ని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం ఆదివారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలో ఏవైనా ఇబ్బందులున్నాయా..? అని ఆయన విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య తదితరులు ఉన్నారు.

ప్రతిష్ఠించిన విగ్రహాలకు జలాభిషేకం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని బొంపల్లి స్టేజీ వద్ద గల అంబరీశ్వర గుట్టపైన ఆదివారం ప్రతిష్ట విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆవహిత దేవత పూజ, ఆవహిత దేవత హెూమం, సహిత రుద్ర హెూమం, పంచ సూక్త హవనం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్టు ఆలయ కమిటీ చైర్మన్ సంగం రాజిరెడ్డి, కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి జంగం శివకుమార్, జంగం ప్రవీణ్, గ్రామ పురోహితులు రమేష్ జోషి, వేద పండితులు శ్యామ్ ప్రసాద్‌శర్మ, జగిత్యాల అంగడి మఠానికి చెందిన భువనేశ్వర్ అయ్యగారు, రాఘవేంద్రశర్మ, విజయసాయి శర్మ తదితరులు పాల్గొన్నారు.

పాలకులారా.. రోడ్డును పునర్నిర్మాణం చేపట్టండి

- గుంతలమయంగా రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లేదారి



నవతెలంగాణ-రామారెడ్డి

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేలాది సంఖ్యలో వాహనాల్లో భక్తులు మండలంలోని మద్దికుంటలో వెలిసిన శ్రీ స్వయంభుగ్గ రామలిం గేశ్వర స్వామిని వేలాది వాహనాల్లో భక్తులు దర్శిం చుకోనున్నారు. ఆలయానికి వెళ్లడానికి మద్దికుంట మర్రి నుంచి, ఈసన్నపల్లి నుంచి రెండు దారులున్నాయి. రెండు బీటీ రోడ్లు గుంతలమయమవ్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శివరాత్రి రోజు వేల సంఖ్యల్లో వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వాహనాలు రానున్నందున వాహనదారులకు మరింత ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు. పాలకులు, ముఖ్యంగా ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, స్థానిక ఎమ్మెల్యే వెంకట్ రమణారెడ్డిలు వెంటనే స్పందించి ప్రజల సౌకర్యార్థం నాణ్యమైన రోడ్డును ఏర్పాటు చేయాలని గ్రామస్తులతో పాటు భక్తులు కోరుతున్నారు.

బీజేపీ మండలాధ్యక్షునికి ఘన సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్


బీజేపీ మండలాధ్యక్షులు బొల్లారం క్రాంతి కుమార్‌కు బాణాపూర్ ముదిరాజ్ సంఘం సభ్యులు ఆదివారం శాలువా కప్పి పూల బోకేను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ పార్టీ ముదిరాజ్ సామజిక వర్గాన్ని గుర్తించి బీజేపీ మండలాధ్యక్షునిగా బాధ్యత ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. పార్టీ అభివృద్ధికి మండలంలోని ముదిరాజులందరం సహకరిస్తామని అన్నారు. ముదిరాజ్ వర్గం నుంచి బీజేపీ మండలాధ్యక్షునిగా నియమించినందుకు ముదిరాజులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయని శ్రీకాంత్, దాసరి సాయిలు, దురిశెట్టి రవి, ముదాం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి యువజన సంఘాల సమావేశం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో గ్రంథాలయ భవనం నిర్మించేందుకు యువజన సంఘాల సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. నిరుద్యోగ యువత పలు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఎంతగానో ఉపయోగపడతాయనే ఉద్దేశ్యంతో గ్రామంలోని భవన నిర్మాణం కోసం ఖాళీ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చారని, వారి సహాయ సహకారాలతో రాజకీయాలకు అతీతంగా భవన నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు యువజన సంఘాల సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1998-99 విద్యా సంవత్సరపు 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. గురువులకు శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఒకే బడిలో చదివిన వారంతా 25 సంవత్సరాల తర్వాత ఒకే వేదికను పంచుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో గురువులు వెంకట్‌గౌడ్, హనుమంత్‌రెడ్డి, దత్తయ్య, విద్యార్థులు సలాం, కటిక రాజు, బండి లింగం, బొమ్మిడి దయాకర్‌రెడ్డి, ఓరుగంటి రవి, వడ్ల సురేష్, గజ్జల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | ఫిబ్రవరి 17, 2025 | www.navatelangana.com

గాయపడ్డ బాలుడిని పరామర్శించిన నాయకులు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని యోగేశ్వర్ కాలనీలో ఇటీవల పిచ్చికుక్కల దాడిలో ఓ బాలుడు గాయపడ్డాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ వినయ్ రెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. బాలుడి ఆరోగ్యాన్ని, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలపై వీధి కుక్కలు దాడి చేయడం బాధాకరమన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రునికి 15 కిలోల భారీ బొచ్చ చేప లభ్యం



నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండల కేంద్రంలో ఆదివారం రోజు చెక్ డాం కు చేపల వేటకు వెళ్ళగా గంగపుత్రుడు బండి కిషన్‌కు 15 కిలోల చేప లభ్యమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు లాగే నేను చేపల వేటకు వెళ్తానని ఆదివారం కూడా చేపల వేటకు వెళ్ళగా తనకు 15 కిలోల బొచ్చ చేప లభించిందన్నారు. దీంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

టీజీసీటీఏ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరించిన రాష్ట్ర సెక్రటరీ బ్రిజేష్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర కళాశాల టీచర్స్ అసోసియేషన్ (టీజీసీటీఏ) డైరీని రాష్ట్ర సెక్రటరీ డా.బ్రిజేష్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో కళాశాల ప్రిన్సిపాల్ డా.రామ్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ డా.గంగాధర్, తెలంగాణ రాష్ట్ర కళాశాల టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డా.దండు స్వామి, సెక్రటరీ డా.లింగన్న, ట్రెజరర్ డా.బాబురావు, సభ్యులు డా. అంబర్ సింగ్, డా.రామ స్వామి, డా.పెద్దన్న డా.సతీష్, డా.అజయ్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

యాదగిరి సంతాప సభను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ యాదగిరన్న సంతాప సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్ కోరారు. ఆదివారం పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్, కోటగల్లిలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కార్యదర్శిగా పనిచేసిన యాదగిరన్న సంతాప సభను పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంతాప సభకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కేజీ రామచందర్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, తదితరులు ముఖ్యవక్తులుగా హాజరవుతున్నారని తెలిపారు. ఈ ప్రెస్‌మీట్‌లో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి సీహెచ్ సాయన్న పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్కగణేష్, టియుసిఐ జిల్లా నాయకులు విటల్, కిరణ్, సీఎల్సి జిల్లా నాయకులు జలంధర్, పాల్గొన్నారు.

ధాన్యంపై అవగాహన



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

డొంకేశ్వర్ మండ లం నికాల్పూర్, నూత్‌పల్లి గ్రామాలలో పిఎస్ఎస్ఎం జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం ధ్యానం, పిరమిడ్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. జరిగింది.ఈ సందర్భంగా ధ్యాన జగత్ మాస పత్రిక పబ్లిషర్ కేశవరాజు హైదరాబాద్ నుండి విచ్చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ మానసిక ప్రశాంతత కోసం, ఇమ్యూనిటీ పవర్ పెంచుకోవడం కోసం ఏకాగ్రత కోసం ప్రతి ఒక్క మనిషి ధ్యానం చేసి ప్రశాంతంగా ఉండాలన్నారు. ధ్యాన జగత్ మాసపత్రిక 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ధ్యాన జగత్ మాసపత్రికను ప్రజలందరూ, ధ్యానులందరూ చదివి ఇతరులతో చదివించాలన్నారు. ఈ సందర్భంగా ధ్యాన జగత్ మాసపత్రికను అందరికీ అందజేశారు. కార్యక్రమంలో పిఎస్ఎస్ఎమ్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి, ప్రధాన సలహాదారులు బొడ్డు దయానంద్, జలపతిరావు, సబ్బాని సుదర్శన్ నూత్‌పల్లి సంతోష్ కుమార్, మెకానిక్ గంగాధర్, పవన్ కుమార్ రాజేందర్, వెల్మల్ భూమన్న, వెల్మల్ భోజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాలు తనిఖీ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో మూడో స్పెల్ ప్రయోగ పరీక్షలు నిర్వహిస్తున్న ప్రయోగ పరీక్ష కేంద్రాలను ఆదివారం జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్ తనిఖీ చేశారు. నిజామాబాద్ పట్టణంలో ప్రయోగ పరీక్షలు జరుగుతున్న రవి కాకతీయ జూనియర్ కళాశాల, సత్య ఒకేషనల్ జూనియర్ కళాశాల, ఎస్సార్ జూనియర్ కళాశాల లను ఓం ఇంటర్ విద్య అధికారి తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్నయ్య, రజియుద్దీన్ అస్లామ్, శ్రీమతి కనకమహాలక్ష్మి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలో మరో 12 కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో కెమెరాలు పనిచేస్తున్న విషయాన్ని స్వయంగా ఇంటర్ విద్య అధికారి, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు పరిశీలించి సమీక్షించారు.

ఇంటర్ విద్య అధికారి రవికుమార్ మాట్లాడుతూ ప్రతి పరీక్షా కేంద్రం లో కెమెరాలకు జియో ట్యాగింగ్ పరిశీలించామని, కెమరాలు ఆగిపోకుండా ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ పని చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ లను ఆదేశించామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో నిబంధనల మేరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఆదేశించారు. లైవ్ కెమెరాల ద్వారా హైదరాబాద్ లో కమాండ్ కంట్రోల్ సెంటర్ లో కమిషనర్ పర్యవేక్షణ చేస్తున్నారని అన్నారు.

మార్పుతోనే సమసమాజ నిర్మాణం

- పట్టణంలో మాజీ డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రొడ్డ రాజన్న సంస్మరణ సభ



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

సమాజమార్పుతోనే సమసమాజ నిర్మాణం అని, సమ సమాజ నిర్మాణం జరగాలంటే సమాజంలో మార్పు జరగడం ద్వారానే సమ సమాజ నిర్మాణం జరుగుతుందని మాజీ డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంస్మరణ సభలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కాలేజీలో ఆదివారం రొడ్డ రాజన్న సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సంస్మరణ సభలో డిటిఎఫ్ రాష్ట్ర మాజీ నాయకులు డాక్టర్ లచ్చయ్య, ఎల్ శ్రీధర్, ప్రస్తుత రాష్ట్ర ఉపాధ్యక్షులు శంతన్, జిల్లా అధ్యక్షులు ఎం. బాలయ్య మాట్లాడుతూ గత సంవత్సరం ఇదే రోజు రొడ్డ రాజన్న ఆకస్మికంగా మరణించడం ద్వారా ఒక సామాజిక ఆలోచన కలిగిన ఉద్యమకారున్ని, డిటిఎఫ్ కోల్పోయినట్లు అయిందని ఆయన లేని లోటు పూడ్చలేనిదని ఆయన ఆదర్శాలు, ఉద్యమ స్ఫూర్తి కొనసాగించడమే ఆయనకు సమర్పించే నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ సామాజిక ఉద్యమ కారులు మరణించినప్పటికీ వారి ఆశయాలు లక్ష్యాలు మన ముందు ఉంటాయని వాటిని ఆచరించి కొనసాగించడం ద్వారానే రాజన్నకు సమర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ఆయన ఆచరణను కొనసాగించాలని అప్పుడే సమాజ మార్పుకు కృషి చేసిన

వారమౌతామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, డి సత్యనంద్, తోపాటు డిటిఎఫ్ నాయకులు పెంటన్న, విజయ్ కుమార్, రాజేందర్, జంగం అశోక్, షేక్ మదర్ జాన్ విల్సన్ స్నేహితులు, రాజేశ్వర్ పెద్దన్న కుటుంబ సభ్యులు బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు రక్షణ ఎక్కడ..?

- నిజామాబాద్ ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో ఆడపిల్లలకు రక్షణ ఎక్కడ ఉందని నిజామాబాద్ జిల్లా ఐద్వా కార్యదర్శి సుజాత ప్రశ్నించారు. ఆదివారం జిల్లా కమిటీ సభ్యురాలు వనజ ధర్పల్లి మండలంలో జరిగిన అనూష హత్య కేసులో సమాచారం ధర్పల్లి వెళ్లామన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. మహిళలకు ఇంట్లో బయట రక్షణ లేకపోవడం కాకుండా పోలీసు వ్యవస్థ మహిళలకు రక్షణ కల్పించడం మానేసి నిందితులను కాపాడే ప్రయత్నం చేయడం వల్లనే హత్యలు అత్యాచారాలు దాడులు రోజురోజుకు పెరుగుతూ ఉన్నాయన్నారు. అనూష హత్య కేసులో నిందితుడైన వినోద్ కుమార్ రిమాండ్ కు పంపకుండా నిందితుడిని కాపాడే విషయంలో ధర్పల్లి పోలీసులు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టుగా అర్థమవుతుందన్నారు. డెడ్ బాడీని కూడా కేసు కాంప్రమైస్ చేసుకుంటేనే ఇస్తామని సీబీఐ ఆఫీస్‌కి తెలిసి కుటుంబ సభ్యుల్ని బెదిరింపులకు గురి చేశారన్నారు. గ్రామస్తులు చెప్పిన వివరాల ప్రకారం చిన్న బాబు కడుపులో ఉన్నప్పుడు ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోయారన్నారు. మళ్లీ నేను ఉండలేకపోతున్నాను నీతో కలిసి ఉంతను అని అమ్మాయిని నమ్మించి మంచిగా ఉంటున్నట్టు నటించి దాదాపు 16 లక్షల రూపాయలు డ్వాక్రా గ్రూపుల్లో లోన్లు తీసుకున్నాడన్నారు. అవి కాకుండా ఇంకో 10 లక్షల రూపాయలు ఇల్లుపై అప్పుచేశాడని తెలిపారు. ఈ 15 రోజులుగా వడ్డీ డబ్బులు కట్టట్లేదు ఇబ్బంది అవుతుందని అనూష గట్టిగా అడగడంతో ప్రాణాలు తీసిన వినోద్ కుమార్‌ను రక్షించడం కోసం పోలీసులు తాపత్రయ పడుతున్నారన్నారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే నిందితులకు కొమ్ము కాస్తే ఇంకా రక్షణ కల్పించేది ఎవరని ప్రశ్నించారు. అనూషకు, పిల్లలకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలో కార్యక్రమాన్ని చేపడతామని ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత హెచ్చరించారు.

మట్టి వాటర్ బాటిల్ రూ.120

- ఆగ్రా నుంచి తెచ్చి అమ్మకాలు
- ఆసక్తిగా కొనుగోలు చేస్తున్న నగరవాసులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్లాస్టిక్ బాటిల్ లో నీళ్ళు తాగొద్దని అనారోగ్యాలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. దీంతో ప్రజలు మట్టి బాటిళ్లపై ఆసక్తి చూపుతున్నారు. మట్టి వాటర్ బాటిల్ లో నీరు చల్లగా ఉంటాయి కనుక వీటిని అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి ప్రత్యామ్నాయాలతో పర్యావరణంతోపాటు ప్రజలకు మంచి జరుగుతుంది. కనుక ఇలాంటివి వాడి ప్లాస్టిక్ బాటిళ్ల నివారణకు ఎవరి వంతుగా వారు ప్రయత్నించడం ఎంతో అవసరం. నిజామాబాద్‌లో మట్టి వాటర్ బాటిళ్ల విక్రయిస్తున్నారు. ఒక్క మట్టి వాటర్ బాటిల్ 120 రూపా యలకు అమ్ముతున్నారు. ఇవి ఉత్తరప్రదేశ్లో తయారు చేసినవి కాగా అక్కడి వారు నిజామాబాద్ నగరంలోని అమ్ముతున్నారు.



ప్రస్తుతం 8 మంది తోపుడుబండ్లపై నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మట్టి వాటర్ బాటిళ్లను అమ్ముతున్నారు.

హాస్పిటల్‌పై దుష్ప్రచారం చేయడం తగదు

- ఆశ హాస్పిటల్ వైద్యులు శేఖర్ రెడ్డి



నవతెలంగాణ-ఆర్మూర్

పనికట్టుకొని కొందరు తమ హాస్పిటల్ పై దుష్ప్రచారం చేయడం తగదని, నిజానిజాలు తెలుసుకోవాలని పట్టణంలోని పెర్కిట్ ఆశ హాస్పిటల్ వైద్యులు శేఖర్ రెడ్డి ఆదివారం తెలిపారు. హాస్పిటల్ వైద్యులు డాక్టర్ బాలొరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని మంతిని గ్రామానికి చెందిన బద్దం చిన్నారెడ్డి (45) గత నెల 8 కడుపునొప్పి రావడంతో ఇతర హాస్పిటల్లో చూయించుకొని ఆ తర్వాత మా హాస్పిటల్‌కు వచ్చారని తెలిపారు. కిడ్నీ స్టోన్స్‌తో 9న మిషన్ ద్వారా సర్జరీ చేసి 13న డిశ్చార్జి చేసినట్టు తెలిపారు. ఇన్ఫెక్షన్ అనేది శరీర తత్వంను బట్టి వస్తుందని, ఇందుకు మేమే బాధ్యులమని దుష్ప్రచారం చేయడం సరికాదని అన్నారు. హాస్పిటల్ పెట్టినప్పటి నుండి ఇప్పటివరకు ఎన్నో కేసులు సక్సెస్ చేసినట్టు చెప్పారు. పేద ప్రజలకు సైతం అతి తక్కువ ఫీజులు తీసుకుంటూ, మానవతా దృక్పథంతో సైతం సేవలు అందిస్తున్నామని తెలిపారు.

నలందలో రాష్ట్రస్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్

నవతెలంగాణ-ఆర్మూర్



పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న పలువురు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఈ అభ్యస అకాడమీ హైదరాబాద్ వారు తెలంగాణ రాష్ట్రంలోని తమ 255కు పైగా అనుబంధ బడ్జెట్ పాఠశాలలో 3 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం, గత పది సంవత్సరాలుగా రాష్ట్రస్థాయి కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ను రెండు స్థాయిలలో నిర్వహిస్తుంది. ఈ విద్యా సంవత్సరంలో 11వ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 55వేల మంది విద్యార్థులు తమ తమ పాఠశాలలో మొదటి స్థాయి పరీక్షలు రాశారు. రెండవ స్థాయి రాష్ట్రస్థాయి పరీక్షను ఏకకాలంలో 10 కేంద్రాలలో 1500 మంది విద్యార్థులు హాజరవుతున్నారని ఈ అభ్యస్ సిఈఓ డాక్టర్ భువనగిరి ఫణి ఫవన్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని మామిడిపల్లి నలంద స్కూల్ సెంటర్లో సుమారుగా నాలుగు జిల్లాలకు సంబంధించిన 18 స్కూల్ విద్యార్థులు, సుమారుగా 500 నుండి 600 విద్యార్థులు పరీక్ష రాశారని నలంద యాజమాన్యం ప్రసాద్ తెలిపారు. కౌసెట్ ప్రతిభ పరీక్షలు మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, రీజనింగ్ సబ్జెక్టులపైన 100 బిట్స్‌తో ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహించబడుతుందని ఈ పరీక్షలు విద్యార్థులను బాహ్య పోటీ ప్రపంచానికి పరిచయం చేసి వారిలో ఉన్న న్యూనతలను తగ్గించి, విజేతలుగా మలచడానికి ఎంతో దోహదం చేస్తాయని పరీక్ష పత్రాన్ని ఆవిష్కరిస్తూ నలంద ప్రిన్సిపల్ సాగర్ అన్నారు. కార్యక్రమంలో ప్రతినిధి జోనల్ మేనేజర్ మణికంఠ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో తరగతి వారీగా 1,2,3 ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఏప్రిల్ 12న హైదరాబాద్లో నిర్వహించే అవార్డు ఫంక్షన్లో మెమెంటోలు, నగదు బహుమతులు, ప్రోత్సాహక ఒలంపియాడ్ ప్రోగ్రాం కిట్ లు, బహుమతులుగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల కరెస్పాండెంట్లు, ఒలంపియాడ్ ఇన్చార్జిలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులను మంజూరు చేయండి

- ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసిన మండల మున్నూరు కాపు సంఘ సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామ శివారులో నిర్మించ తలపెట్టిన మండల మున్నూరు కాపు సంఘ భావన నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని మున్నూరు కాపు మండల కమిటీ ఆధ్వర్యంలో ఓబిసి జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌ను ఆదివారం నిజామాబాద్‌లో బిజెపి జిల్లా అధ్యక్షులు కులాచారి దినేష్ కుమార్‌తోకలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ.. త్వరలో నిర్మించనున్న మండల మున్నూరుకాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులను సమీకరించడానికి పలువురు ప్రజాప్రతినిధుల వద్దకు వస్తున్నట్లు వారు వివరించారు. ఎంపి లక్ష్మణ్ నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కలిసిన వారిలో మండల మున్నూరు కాపు గౌరవ అధ్యక్షులు పులి సాగర్, గడ్కోల్ శ్రీనివాస్, ఉపా అధ్యక్షులు విట్టల్, శ్రీనివాస్, క్యాషియర్ గంగాధర్, కార్యదర్శి జె.శ్రీనివాస్, లోలం సత్యనారాయణ, ధర్పల్లి సాయి రెడ్డి, గట్టు కాడరి, తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఐక్యతే లక్ష్యం: బీఎస్పీ

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్...



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్ర విధాన సభకు ఎంపిక చేసుకునే అభ్యర్థులు కీలక చట్టాలు చేయడంలో కీలక భూమిక ఉంటుందని, కాబట్టి నిష్ణాతులైన వారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన ఓ ప్రైవేట్ హెూటల్ లో మీడియాతో మాట్లాడారు. బీఎస్పీ పార్టీ నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ కి పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా పోటీ చేస్తున్న సాయన్న కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులు లను, ఉపాధ్యాయులను కోరారు. ఆయా రాజకీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న వారు పక్కగా వ్యాపారాలను కాపాడుకోవడానికి పోటీ చేస్తున్నారని, విద్యార్థులకు కనీస ఫీజును తగ్గించలేని వారు ఇప్పుడు పోటీ చేయడం వెనక ఆంతర్యం ఏమిటో గుర్తించాలని తెలిపారు. అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ గా పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణ ప్రత్యేకంగా నిరుద్యోగ నిర్మూలన కోసం కృషి చేశారని ఎమ్మెల్సీ అయితే నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఎంతో కృషి చేస్తారని అన్నారు. నిజాయితీగా ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అలాగే ఓల్డ్ పెన్షన్ విధానం రావాలంటే సాయన్న ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మరోవైపు విద్యను పూర్తిగా ప్రైవేటుకరణ చేసే దిశలో రాజకీయ పార్టీల ఉన్నాయని తెలిపారు. ఇక కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎస్టి బీసీ లను అది నుంచి అన్యాయం చేస్తుందని అన్నారు. మొదటి నుంచి ఎన్నో కమిషన్లు చేసిన వాటి నివేదికలను బయటకు తీయకుండా తొక్కి పెట్టిందని చెప్పారు. కాన్షిరాం ఆధ్వర్యంలో మండల్ కమిషన్ కోసం ఉద్యమించి బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు తీసుకు వచ్చారని అన్నారు. కమండల్ కమిషన్ అంటూ బిజెపి మండల కమిషన్ కు వ్యతిరేకంగా పని చేసిందని అన్నారు. ఇలా కీలక రాజకీయ పార్టీల ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు రిజర్వేషన్లు లేకుండా కుట్ర చేస్తుందని అన్నారు. దేశంలో పేరు మోసిన విద్య సంస్థలలో అగ్రవర్ణ కులాల ఉద్యోగులే అత్యధిక సంఖ్యలో ఉన్నాయని ఇటీవల ఆర్ టీ ఐ ద్వారా ఈ ఇషయం వెలుగులోకి వచ్చిందని అన్నారు.

కాన్షీరాం ఇచ్చిన నినాదం " ఎవరు ఎంతో వారికి అంత వాటా" ప్రకారమే ఇప్పుడు ఉద్యమాలు జరుగుతున్నాయని అన్నారు. అగ్ర కులలో పేదలు ఉన్నారని, వారికి రిజర్వేషన్లు ఇవ్వడాన్ని బిఎస్‌పి మద్దతు ఇస్తుందని అన్నారు. బీసీ బిడ్డలైన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యాతకర సాయన్న లకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గైని గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిరెడి ఈశ్వర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు పాండు, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు హరిలాల్ నాయక్, నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాలకు చెందిన బీఎస్పీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

• నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వినయ్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ బొర్ర గణపతి ఆలయం యందు నెలకొన్న సమస్యల పరిష్కారానికై నిర్విరామ కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి అన్నారు. ఆదివారం సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆలయాన్ని సందర్శించినారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, స్థానికులు శాలువా తో సన్మానించినారు. ఈ కార్యక్రమంలో గంగా మోహన్, పెర్కిట్ పిఎసిఎస్ చైర్మన్ పెంట బోజారెడ్డి, నాయకులు మామిడ శేఖర్ రెడ్డి, మానేటి లింబాద్రి, నూనె నరేష్, మెడికల్ సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో నాగర్ కర్నూల్

నవతెలంగాణ-మద్నూర్



నాగర్ కర్నూల్‌లో రాష్ట్ర సగర (ఉప్పరి) సంఘం ఆదివారం తలపెట్టిన సగర శంఖరావం భారీ బహిరంగ సభకు జుక్కల్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లినట్టు సగర ఉప్పరి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.హనుమన్లు తెలిపారు. సగర ఉప్పరి కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సగరు ఉప్పరి కులస్తులకు బిసి-డి నుంచి బీసీ-ఏలో కలపాలని డిమాండ్ చేశారు.

మరోమారు సర్వేతో

స్థానిక ఎన్నిక ఆలస్యం

• ఆశావహులకు నిరాశ
• కుంటుపడనున్న అభివృద్ధి



నవతెలంగాణ- నసురుల్లాబాద్

రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఈనెల 15న ఏర్పాటు చేసి 16, లేదా 17 తేదీల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని ప్రజాప్రతినిధులు పలు ప్రసంగాలు చేయడం తోపాటు , రాష్ట్ర ఎన్నికల అధికారులు ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు. దీనితో ఈ నెలలో స్థానిక ఎన్నికలు జరగడం ఖాయమని అందుకు అధికారులకు ఎన్నికలపై శిక్షణ తరగతులు నిర్వహించడంతో ఎన్నికల్లో పోటీ చేసే ఆశావావులకు ఆశలు చిగురించాయి. బుధవారం రాష్ట్ర మంత్రి కుల గణన సర్వే ఈనెల 16 నుండి 28 వరకు మరో మరో సర్వే నిర్వహించాలని ఆదేశించడంతో స్థానిక ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మార్చి మాసంలో ఇంటర్ మరియు 10వ తరగతి ఇతర ఇతర పరీక్షలు ఉండడంతో స్థానిక ఎన్నికలు ఇంతలో లేనట్లు అనే కనిపిస్తుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు ఈ నెల 17వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందని అందరూ భావించారు. బీసీల రిజర్వేషన్, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని స్థానిక ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధం చేసిన. సర్కారు తీరా మరోమారు కులగణనకు సిద్ధమైంది. గత సర్వేలో పాల్గొనని వారి ఇండ్లకు సిబ్బందిని పంపి ఈనెల 16 నుంచి 28వ తేదీ వరకు రీ-సర్వే చేయించబోతోంది. ఇదే సమయంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేసిన సర్కారు రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించే అవకాశం కనిపిస్తోంది. అందులోనూ పది, ఇంటర్ పరీక్షల తరువాతనే ప్రక్రియ ప్రారంభమవుతుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏదేమైనా 'స్థానిక' పోరుకు బ్యాలెట్ పత్రాలు సిద్ధం చేసుకుని, మాస్టర్ ట్రెయినర్లకు శిక్షణ పూర్తి చేసుకుని ఎన్నికలకు అధికారయంత్రాంగం రెడీగానే ఉంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన సామాగ్రి ఇప్పటికే ఆయా జిల్లాలకు చేరిందని సమాచారం.

పరీక్షల అనంతరమే ఎన్నికలు

రాష్ట్రంలో రాబోయే పదవ తరగతి మరియు ఇంటర్ పరీక్షలు త్వరలో రానున్నాయి దీనికి సంబంధించిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు విద్యార్థులకు ప్రత్యేక తరగతుల బోధనలో నిమగ్నమై ఉన్నారు. ఎన్నికల నిర్వహణలో కీలకమైన రిటర్నింగ్ అధికారుల తోపాటు ఇతర సిబ్బందిని నియమించాలనే ఈసీ ఆదేశాలకు అనుగుణంగా వాటి జాబితాను కూడా సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అధికారులు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలు పెట్టడంతో పల్లెల్లో ఎన్నికల హడావిడి మొదలైంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్కు కట్టుబడి ఉన్నామని మంత్రులు పదేపదే స్పష్టం చేసిన నేపథ్యంలో బీసీ సామాజికవర్గాల్లో ఆశావహులు పెద్దఎత్తున తెరమీదకు వస్తున్నారు.

ఎన్నికలు మరింత ఆలస్యమనే సంకేతాలు

ఎన్నికల ప్రక్రియకు మాత్రం ప్రస్తుతం కులగణన రీసర్వే కొంత బ్రేక్ వేసినట్టయింది. ఈనెల 16 నుంచి 28వరకు గతంలో సర్వేలో పాల్గొనని వారి ఇండ్లకు వెళ్లి సర్వే చేసిన అనంతరమే రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదిస్తామని రాష్ట్ర మంత్రి తెలపడం, దీంతో రాబోయే పది, ఇంటర్ పరీక్షల తరువాతనే ఎన్నికలు ఉంటాయనే సంకేతాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ పరీక్షలు కూడా మార్చి 21తో మొదలై ఏప్రిల్ 4 వరకు సాగనున్నాయి. ఈ ఎన్నికలకు ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్లు ఎక్కువ సంఖ్యలో అవసరం కాగా. పరీక్షల అనంతరమే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. అలాగే మరో మూడు మాసాలు వేచి ఉండడం తోపాటు కార్యకర్తలకు ఓటర్లను మచ్చిక చేసేందుకు ఖర్చు పెరిగే అవకాశం ఉంది.

శిఖర స్థాపనకు సిద్ధం

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని చిన్నశక్కర్గ గ్రామంలోని మారుతి మందిరం శిఖర స్థాపన కోసం గ్రామస్తులంతా ఏకమై మందిరాన్ని అన్ని రకాల హంగుళాలతో తీర్చిదిద్దారు. శిఖర స్థాపన 21న ఉదయం 10 గంటలకు మల్లికార్జున స్వామి కత్గావ్ కర్ మహరాజ్ పూజా సమక్షంలో నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు.

శ్రీ బాల త్రిపుర సుందరి దేవి ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాద్

ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో సోమవారం శ్రీ బాల త్రిపుర సుందరి దేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ పెద్దలు, గ్రామస్తులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తీర్థ ప్రసాదం, కుంకుమార్చన, పాలాభిషేకం అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

అంజిరెడ్డిని గెలిపించండి

• డాక్టర్ పైడి ఎల్లారెడ్డి



ఓటర్లను కలుస్తూ ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని డాక్టర్ పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా పట్టభద్రుల ఓటర్లను కలుస్తూ అంజిరెడ్డి భరోసా గురించి వివరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్చార్జి హైమారెడ్డి, మండల అధ్యక్షులు మధుసూదన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు విట్టల్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, శ్రీధర్, రాజు, గంగి రమేష్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డం గంగా భాగీర్త కుటుంబానికి ఎంపి పరామర్శ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన గడ్డం గంగ భాగీ కుటుంబాన్ని నిజామాబాద్ ఎంపీ అరవింద్ పరామర్శించినట్టు మండల బిజెపి అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ తెలిపారు. ఇటీవల గడ్డం గంగా భాగీర్త మరణించడంతో వారి కుటుంబాన్ని నిజామాబాద్ ఎంపీ అరవింద్ పరామర్శించి ఓదార్చారు. అనంతరం ద్వాదశ దినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట మండల బిజెపి అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షుడు బట్టు దత్తు గౌడ్, మండల బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

18న గ్రామీణ వైద్యుల చలో హైదరాబాద్

తెలంగాణ-తాండూర్

ఈ నెల 18న హైదరాబాదులో నిర్వహించే గ్రామీణ వైద్యుల ఆత్మగౌరవ సభకు జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీ అనుభవ వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల రవి తెలిపారు. ఆదివారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో మాట్లాడారు. 2009లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్రంలోని ఆర్ఎంపి వైద్యులకు తగు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు కూడా అందజేశారని తెలిపారు. గ్రామీణ వైద్యులకు కనీస గుర్తింపు కూడా లేకుండా పోయిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాపాల సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పీఎంపీ, ఆర్ఎంపివైద్యుల వృత్తిపరమైన శిక్షణ ఇచ్చి తగు గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు. ఆత్మగౌరవ సభకు జిల్లా నలుమూలల నుంచి ఆర్ఎంపీ, పీఎంపీలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సభకు ఎమ్మెల్సీలు ఎం కోదండరాం, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యుల సంఘం జిల్లా సీనియర్ నాయకులు డాక్టర్ సజ్జనపు బ్రహ్మానందం, లక్ష్మణచారి, నాయకులు జూపాక బానేష్, పోలు శ్రీనివాస్, పెండెం కనకయ్య, దశరథం, ఎం శ్రీనివాస్, భూపతి రాజు, రాజేష్ పాల్గొన్నారు.

ముగిసిన లయన్స్ క్లబ్ రీజియన్ మీట్

నవతెలంగాణ-జన్నారం

లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి రీజియన్-3 మీట్ కార్యక్రమం ఘనంగా ముగిసిందని లైన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని పైడిపల్లి గార్డెన్‌లో ఈ కార్యక్రమాన్ని లైన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ హెచ్. రాజి రెడ్డి పాల్గొని సమాజ సేవలో లయన్స్ క్లబ్ భాద్యతలపై ప్రసంగించారు. ప్రధాన వక్త డాక్టర్ బి సంతోష్ శర్మ లయన్స్ సేవా ప్రాముఖ్యత, నాయకత్వ నైపుణ్యాలపై విలువైన సందేశం అందించారు. విశిష్ట అతిథిగా జన్నారం ఎస్ఐ రాజా వర్ధన్ హాజరై సమాజ సేవలో లయన్స్ పాత్రను కొనియాడారు. కార్యక్రమంలో రీజియన్ అడ్వైజర్ ఆర్. నారాయణ రెడ్డి, లేడీ లైన్ ఏనుగు రజితరెడ్డి, కార్యక్రమ కమిటీ చైర్మన్ హనుమంత్ రావు, సహా చైర్మన్ నూరాని, రీజియన్ సెక్రటరీ అనుముల రాజన్న, రీజియన్ ట్రెజరర్ పొన్కల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, జోన్ చైర్మన్‌లు అజుత రావు, కె వెంకటేశ్వర్లు, గుండ పవన్, సతీష్, జగదీష్, సందీప్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా సహకార అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించి, ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన దొండి సాయినాథ్‌ను ఆదివారం శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఎన్టీఆర్ మార్గ్ కాలనీ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ మార్గ్ సొసైటీ అధ్యక్షులు భూసారపు గంగాధర్ మాట్లాడుతూ వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ గౌరవాధ్యక్షులు లింగంపల్లి లక్ష్మీనారాయణ, సెక్రటరీ శివరాం వెంకటేష్, చిటిమల సదయ్య, సోలాపూర్ రాజేశ్వర్, ఆడేపు సుధాకర్, సింగిడి భూషణ్‌రెడ్డి, పడిగెల వేణుగోపాల్, పోలిశెట్టి రాజు, ద్యాగలక్ష్మి రాజు, సంఘం మహేందర్, నాచం సతీష్, తోడిశెట్టి పరమేశ్వర్, శనిగారపు పోశెట్టి, సంఘం నరేందర్, ఆరేపల్లి రవీందర్ పాల్గొన్నారు.

ప్రతి పక్ష నాయకులు

అనవసరపు మాటలతో కాలం వెళ్లదీస్తున్నరు

కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

గత వారం రోజులుగా జీవన్ రెడ్డి, అరవింద్ వారి స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని, కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత వచ్చిందని, అరవింద్ బీసీ కుల గణనపై మాట్లాడుతున్నాడని, కులగణన విషయంలో బీజేపీ పాత్ర ముఖ్యంగా అరవింద్ అభిప్రాయం ఏంటి అని, నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఏ మేరకు ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నుడా చైర్మన్ కేశవేణుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకు అప్పుడప్పుడు వస్తూ ప్రభుత్వంపై మాట్లాడితే ఊరుకునేది లేదు అని, అలా చేస్తే మీ స్థాయి తక్కువ చేస్తున్నవాడివి అవుతావని, రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కుల గణన విజయవంతంగా జరిగిందని, కులగణన చేయడం ద్వారా ఎవరి వాటా ఎంత అని తెలిస్తే తమ ఉనికికే ప్రమాదం అవుతుందని, ప్రతి ఒక్కరు తమ వాటా అడుగుతారని అరవింద్ భయపడుతున్నాడని అన్నారు. బీసీ కుల గణన చెయ్యాలా వద్దా.. అని బండి సంజయ్ అరవింద్ చెప్పాలని, బీసీలో మైనారిటీలు ఎలా ఉంటారని బీజేపీ ప్రశ్నిస్తుందని, మరి మోదీ ప్రవేశ పెట్టిన ఈడబ్ల్యూఎస్ కోటాలో మైనారిటీలు లేరా.. అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన పాపాలు కడగడానికే కాంగ్రెస్ ప్రభుత్వానికి సంవత్సర కాలం పట్టిందని, కవిత అబద్దాలు మాట్లాడుతూ.. విలువ తగ్గించుకోవద్దని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డికి టికెట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. సోమవారం బోర్గంలోని భూమారెడ్డి గార్డెన్లో జూపల్లి కృష్ణరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం జరుగుతుందని తెలిపారు. అరవింద్ కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ అభ్యర్థి లేడని మాట్లాడుతున్నాడని, ఇది అరవింద్ బుద్ధిలేని తనానికి నిదర్శనమని, కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి అని తెలిపారు. జిల్లా పట్టభద్రులు నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఉపాధ్యాయులకే వదిలేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని ఆయన అన్నారు. బీజేపీ అనేది ఒక జుటా బద్మాష్ పార్టీ అని, బీసీలుగా ఉన్న బీజేపీ నాయకులు బీసీ కులగణనను వ్యతిరేకిస్తున్నారని, అది వాళ్ల పిచ్చితనానికి నిదర్శనం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరాల రత్నాకర్, మాజీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రామర్తి గోపి, జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు నరేందర్ గౌడ్, రాష్ట్ర ప్రచార కమిటీ మెంబెర్ జావీద్ అక్రం, కార్పొరేటర్ గడుగు రోహిత్, యూత్ కాంగ్రెస్ నగర మాజీ అధ్యక్షులు ప్రీతం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

• మున్సిపల్ కమిషనర్ రాజు

నవతెలంగాణ-ఆర్మూర్



ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుల గణన సర్వేలో పాల్గొనని వారు పట్టణంలో 73 మందిని గుర్తించామని మున్సిపల్ కమిషనర్ రాజు ఆదివారం తెలిపారు. ఈనెల 16 నుండి 28 వరకు సర్వేలో పాల్గొనని వారు వివరాలు అందజేయవచ్చున్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజాపాలన సేవ కేంద్రం ఏర్పాటు చేసామన్నారు. సెలవు రోజుల్లో కూడా ప్రజాపాలన సేవ కేంద్రం పనిచేస్తుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు కాపాడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు కాపాడాలని కార్మికులపై వేధింపులు పనిభారాలు మానుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి కె.ఎస్ రెడ్డి, రీజనల్ కార్యదర్శి ఎం.భీమ్‌రావు అన్నారు. ఆదివారం ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ ఆదిలాబాద్ రీజియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఆర్టీసీ సంస్థలో కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలు సంస్థలో వస్తున్న మార్పులపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి డిపోలో కార్మికులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఓవైపు కిలోమీటర్ల పెంపూ, ఓటీలు తగ్గింపు డిపోలలో సరిపోయినంత కార్మికులు లేక రిక్రూట్మెంట్ లేక, విరామం లేకుండా, బలవంతంగా డబుల్ డ్యూటీలు చేస్తూ కార్మికులు అనారోగ్యం పాలైన శుభ అశుభ కార్యక్రమాలకు ఒక్కరోజు లీవ్ దొరకని పరిస్థితులు ఉన్నాయన్నారు. మరోపక్క ఈ పీకే పేరుతో కండక్టర్లను కేఎంపిఎల్ పేరుతో డ్రైవర్లను నిత్యం వేధింపులు మాములైందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫేమ్ స్కీం కింద ఇస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీలకు ఇవ్వకుండా ప్రయివేట్ సంస్థలకు ఇస్తూ సబ్సిడీలను కూడా వారికి ఇవ్వడం అంటే ప్రయివేటీకరణను ప్రోత్సహించడమే అన్నారు. ఈ సమస్యలు సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ నిర్మాణం కోసం అన్ని రీజియన్లలో పర్యటించి, కార్మికులను చైతన్యం చేయడం కోసమే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు అశోక్, సురేష్, నారాయణ, దత్తు, అనిల్ కుమార్, వెంకటేష్, దేవన్న, ఎస్ నారాయణ పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి

బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు

నవతెలంగాణ-నస్పూర్

జనాభాలో మైనార్టీగా ఉన్న అగ్రవర్ణ ప్రయోజనాల కోసమే నరేంద్ర మోడీ ప్రభుత్వం అగ్రవర్ణ రిజర్వేషన్లను తీసుకువచ్చిందని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు పేర్కొన్నారు. ఆదివారం సీసీసీ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన బీసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యవక్తగా హాజరయి ప్రసంగించారు. రేవంత్‌రెడ్డి సర్కారు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దుచేసి బీసీ రిజర్వేషన్లను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలు మెజారిటీగా ఉన్న ప్రాంతాల్లో బీసీలు ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా గెలుపొందే దశలో మంచిర్యాల జిల్లా ప్రజలు చైతన్యం కావాలని ఆయన పేర్కొన్నారు. బీసీ బిడ్డలు రాజ్యాధికారంలో కూర్చుని అగ్రవర్ణాలకు సీట్లు పంపిణీ చేసే రోజు రావాలని ఆయన కోరారు. మండల్ కమిషన్ సిఫారసు చేసిన అన్ని అంశాలను కేంద్ర ప్రభుత్వం అమలు పరచాలని డిమాండు చేశారు. మెజార్టీ వర్గం ఆకాంక్షలు నెరవేర్చడమే నిజమైన ప్రజాస్వామ్యమని ఆయన పేర్కొన్నారు. కులగణనని సత్వరం పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను, సామాజిక సంపదలో బీసీ వాటాను పెంచాలని సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం పేర్కొన్నారు. రాజ్యాంగం అందించిన హక్కులు నిలబడాలంటే బహుజన చైతన్యంతో ప్రజలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మంచిర్యాల గడ్డపై బీసీ చైతన్యంతో ఉద్యమించాలని సమ్మేళనం నిర్వాహకులు ప్రజలకు పిలుపునిచ్చారు. పూలే అందించిన బహుజన చైతన్యాన్ని ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, బీసీ సంఘాల నాయకులు గాండ్ల హరిప్రసాద్, తుల మధుసూదన్, కర్ణె శ్రీధర్, రఘునందన్, గాజుల ముఖేష్ గౌడ్, బెల్లంకొండ మురళి, గంగాధారి తిరుపతి పాల్గొన్నారు.